50 వేల కోట్ల అప్పు

మొదటిపేజీ తరువాయి...

కాదు.. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. రోజుకు సగటున రూ. 210 కోట్ల చొప్పున అప్పు చేస్తున్నారు. అలా అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రూ. 50 వేల కోట్లు అప్పు చేశారు. గడిచిన 60 ఏండ్ల ఉమ్మడి పాలనలో తెలంగాణకు సంబంధించి గత ప్రభుత్వాలు చేసిన అప్పు రూ. 72 వేల కోట్లుగా ఉండగా.. ఆ రికార్డును ఏడాదిలోనే అధిగమించేందుకు రేవంత్ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్నది. సరే.. చేసిన ఆ అప్పు ద్వారా సేకరించిన సొమ్మునైనా ప్రాజెక్టులు, ప్రజా సంక్షేమానికైనా ఖర్చు పెట్టారా? అంటే అదీ లేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల ద్వారా సేకరించిన ధనం.. ఎటు వెళ్తున్నదన్న ప్రశ్న యావత్తు తెలంగాణ సమాజంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

బీఆర్ఎస్‌హయాంలో అప్పులు చేయడాన్ని ఓ పాపంగా వల్లెవేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి రాగానే అప్పులే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. 60 ఏండ్ల ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలన్నీ కలిపి తెలంగాణకు సంబంధించి రూ. 72,658 కోట్లు అప్పుగా చేస్తే, గడిచిన 8 నెలల పాలనలో రేవంత్ ప్రభుత్వం రూ. 50 వేల కోట్లు అప్పులు చేయడమే దీనికి రుజువు. ఈ ఏడాది జూలై 24 నాటికి రూ.35,118 కోట్లు అప్పుగా తీసుకున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ సర్కారు వెల్లడించింది. అనంతరం.. రిజర్వు బ్యాంకు వద్ద ఈ నెల 6న రూ. 3 వేల కోట్లు అప్పు చేసింది. 13న (మంగళవారం) మరో రూ.3000 కోట్ల అప్పు తీసుకొనేందుకు చర్యలు చేపట్టింది. అంతక్రితం హెచ్‌డీసీవో నుంచి రూ. 3 వేల కోట్లు, ఎన్సీడీసీ నుంచి మరో రూ. 5 వేల కోట్లు ఇలా మొత్తంగా 8 నెలల్లో రేవంత్ ప్రభుత్వం రుణాలు రూ. 50,118 కోట్లకు చేరాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం రూ.62,012 కోట్లు రుణ సమీకరణ చేయనున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. బహిరంగ మార్కెట్ నుంచి రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1000 కోట్లు అలా మొత్తంగా రూ. 62 వేల కోట్లు సమీకరించనున్నట్టు వివరించింది.



దుష్ప్రచారంతో పబ్బం

పదేండ్లపాలనలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అప్పులపాల్జేసిందని రేవంత్ ప్రభుత్వం తరుచూ దుష్ప్రచారాన్ని చేస్తున్నది. అయితే, తీసుకొచ్చిన అప్పులను చూస్తున్నారేగానీ, రాష్ట్రంలో పెంచిన ఆస్తుల విలువను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవట్లేదని తెలంగాణ మేధావులు అంటున్నారు. సాధారణంగా ప్రభుత్వాలు తెచ్చిన అప్పులను పెట్టుబడిగా మార్చి.. భవిష్యత్తులో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆదాయ వనరుగా మారే ప్రాజెక్టుల్లోనో, ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థను ఏర్పాటు చేయడానికో వాడుతుంటాయి. ఉదాహరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు తీసుకొచ్చి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసింది. ఇవి ప్రత్యక్షంగా ప్రజలకు, పరోక్షంగా ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మారాయి. రుణాల ద్వారా మిషన్ భగీరథ వంటి పథకాలను ప్రవేశపెట్టింది. ఇది ఆదాయ వనరు కాకపోయినా, ప్రజల జీవన స్థితిగతులను మార్చింది. ఇలాంటి పథకాలు, ప్రాజెక్టులను గత 8 నెలల్లో రేవంత్ ప్రభుత్వం ఒక్కటి కూడా ప్రకటించలేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 వేల కోట్ల భారీగా అప్పులు చేసినప్పటికీ ఆ సొమ్మును దేనికి వెచ్చిస్తున్నదో ఎవరికీ అంతుచిక్కడం లేదు. రైతు భరోసా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయని రేవంత్ సర్కారు.. ఎంతో ఆర్భాటంగా చెప్పుకొంటున్న 'మహాలక్ష్మి' పథకానికీ నిధులు విడుదల్చడం లేదు. దీంతో అప్పుగా తీసుకొచ్చిన సొమ్ము ఎటు వెళ్తున్నదన్న చర్చ మొదలైంది.



సృష్టించిన సంపదపై నోరు మెదపరేం?!

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అప్పుల కుప్పగా మారిందంటూ దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గత పదేండ్లలో రాష్ట్ర సంపద ఎలా పెరిగిందో చెప్పడానికి మనసురావడం లేదు. వాస్తవానికి దేశంలోని అనేక రాష్ట్రాలు తెలంగాణ కంటే ఎక్కువ అప్పులు చేశాయి. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం పరిమితికి లోబడే వ్యవహరించింది. ఇష్టారాజ్యంగా కాకుండా అవసరం మేరకే రుణాలు తెచ్చి ప్రాజెక్టుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధికి వెచ్చించిందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. 2023-24 నాటికి తెలంగాణ ప్రభుత్వం రూ.3.89 లక్షల కోట్ల రుణాలు సేకరించినట్టు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 5న లోక్‌సభలో వెల్లడించింది. ఇది తెలంగాణ జీఎస్డీపీలో 27.8 శాతానికి సమానమని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలో పేర్కొన్నది. 2014లో స్వరాష్ట్రంగా ఏర్పడేనాటికి అన్ని రంగాల్లో అధ్వాన స్థితిలో ఉన్న తెలంగాణ.. 2024 నాటికి రాష్ట్ర బడ్జెట్, రెవెన్యూ రాబడులు, తలసరి ఆదాయం, జీఎస్డీపీ పెరుగుదల ఇలా అన్ని రంగాల్లోనూ ఉన్నత శిఖరాలకు చేరింది. దీన్నిబట్టే గత పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ సంపద గణనీయంగా పెరిగినట్టు స్పష్టమవుతున్నది. ఇదే సమయంలో హద్దులు దాటి రెట్టింపు అప్పులు చేసిన రాష్ట్రాలు ఎన్నో ఉన్నాయి. ఈ జాబితాలో పశ్చిమ బెంగాల్ 37.1% అప్పులతో అగ్రస్థానంలో ఉన్నట్టు కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి దేశ అప్పు రూ.185 లక్షల కోట్లకు చేరుతుందని, ఇది జీడీపీలో 56.8 శాతానికి సమానమని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెట్‌లో పేర్కొన్నది.

రేవంత్ ప్రభుత్వం రుణాలు ఇలా..

తేదీ	రుణం (కోట్లలో)
13.08.2024	3000
06.08.2024	3000
30.07.2024	1000
25.07.2024	5000
23.07.2024	3000
16.07.2024	2000
02.07.2024	2000
25.06.2024	1000
18.06.2024	2000
04.06.2024	2000
14.05.2024	1000
07.05.2024	3000
23.04.2024	1500
09.04.2024	1500
02.04.2024	1000
26.03.2024	1718
19.03.2024	2000
12.03.2024	2000
05.03.2024	3000
05.03.2024	2000
13.02.2024	1000
06.02.2024	2000
23.01.2024	1000
16.01.2024	2000
19.12.2023	900
12.12.2023	500
మొత్తం	50,118

ఆదాయాన్ని పెంచడానికే అప్పుడు రుణాలు

స్వరాష్ట్రంగా ఏర్పడేనాటికి తెలంగాణ అప్పులు రూ.72,658 కోట్లుగా ఉన్నట్టు నిరుడు డిసెంబర్‌లో విడుదల చేసిన శ్వేతపత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొన్నది. అంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి తెలంగాణపై ఉన్న రుణభారం అది. కేంద్రంలోనూ అంతే. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి దేశ అప్పు రూ.55 లక్షల కోట్లు. వాటిని ఆ తర్వాత వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం చెల్లించింది. కానీ, గత పదేండ్లలో దేశంపై ఏకంగా రూ.130 లక్షల కోట్ల రుణభారాన్ని మోపింది. ఆ అప్పులను తర్వాతి ప్రభుత్వాలు చెల్లించాల్సిందే. అయితే, అప్పుల ద్వారా సేకరించిన ధనాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నారన్న అంశమే ఇక్కడ ప్రధానం. 2014లో తెలంగాణ బడ్జెట్ రూ.లక్ష కోట్లు మాత్రమే. అప్పటి అప్పు బడ్జెట్‌లో 72 శాతంగా ఉన్నది. దీంతో రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం రుణాలను సేకరించి, ఆ నిధులను మూలధన వ్యయంగా ఖర్చు చేసింది. అటు మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఇటు భారీ ప్రాజెక్టులు, పథకాలు అమలు చేసింది. ఫలితంగా తెలంగాణ జీఎస్డీపీ, రాబడి, తలసరి ఆదాయం రెండున్నర రెట్ల మేరకు పెరిగాయి. అయితే, అప్పులను చేసుకుంటూపోతున్న రేవంత్ ప్రభుత్వం.. ఆ మొత్తాన్ని పథకాలకూ కాకుండా, మౌలిక సదుపాయాలకూ కాకుండా ఇంకా దేనికి వినియోగిస్తున్నదన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్న రేవంత్ ప్రభుత్వం.. ఆ మొత్తాన్ని గత బీఆర్ఎస్ సర్కారులాగే తెలంగాణ అభివృద్ధికి వినియోగించకపోతే..రాష్ట్రం దివాళా తీయడం ఖాయమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అధికారం కోసం కాంగ్రెస్ అడ్డగోలు హామీలు

- రైతుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సమతూకం
- పెట్టుబడులూ భారీగా వచ్చాయి: జయప్రకాశ్



హైదరాబాద్, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా. జయప్రకాశ్ నారాయణ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చి రైతుల అప్పులు తీర్చడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం అభివృద్ధిలో సమతూకం పాటించారని, మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని, పెట్టుబడులు కూడా భారీగా వచ్చాయని ప్రశంసించారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడిన రోజు దేశంలో అతి ఎక్కువ మిగులు ఉన్న రాష్ట్రంగా ఉండేదని, 14వ ఆర్థిక సంఘం నివేదికలో రూ.1.16లక్షల కోట్ల రెవెన్యూ మిగులు రాష్ట్రంగా చూపారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్-1గా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 31వేల కోట్లు అప్పులు తెచ్చి రైతుల అప్పులు తీరుస్తున్నారని, ప్రపంచంలోనే అనితర సాధ్యమైనదాన్ని సాధించినట్టు ప్రకటనలు ఇచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలా చేయడం ద్వారా అప్పులు సకాలంలో చెల్లించేవాడు మూర్ఖుడు.. ఎగ్గొట్టేవాడు తెలివిగలవాడు అనే సంకేతాలు ఇస్తున్నారా..? అని ప్రశ్నించారు. అంతేకాదు, రుణాలు తీసుకోండి.. మేము వచ్చాక మాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికలప్పుడు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇదేనా సమాజానికి మనం ఇచ్చే సంకేతం అని ప్రశ్నించారు. ఇలా చేయడం వల్ల రేపు రైతులకు రుణాలు వస్తాయా? బ్యాంకులు అప్పులు ఇవ్వకపోతే మళ్లీ రైతులు ప్రైవేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తుంది అన్నారు. రైతుల పేరు చెప్పి రైతులను భవిష్యత్తును ధ్వంసం చేస్తున్నాం.. సమాజాన్ని నాశనం చేస్తున్నాం, ఆర్థిక వ్యవస్థను పతనం చేస్తున్నాం అని జేపీ ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణలోని సమస్యలు తెచ్చిపెట్టుకున్నవని, స్వయంకృతాపరాధమని చెప్పారు. బంగారంలాంటిది ఉంటే దాన్ని సక్రమంగా ఉపయోగించుకోవడం కాకుండా అధికారం వస్తే రాష్ట్రం సర్వనాశనం అయినా ఫరవాలేదనేలా వ్యవహరించారని అన్నారు. ఇప్పటికైనా మేల్కొనకపోతే పచ్చటి రాష్ట్రంలో చిచ్చుపెట్టినవాళ్లవుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ బంగారు గుడ్డుపెట్టే బాతు వంటిది అయినందున ఇప్పటికైనా ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడడం సాధ్యమేనని స్పష్టం చేశారు. అవినీతి వల్ల, అసమర్థత వల్ల, మూర్ఖపు విధానాల వల్ల ఈ బంగారు బాతును చంపకుండా ఉంటే తెలంగాణను కాపాడుకోవచ్చని చెప్పారు.

జాబ్ క్యాలెండర్ అబద్ధం...

జాబ్ క్యాలెండర్ అంత పచ్చి అబద్ధం మరొకటి లేదని జయప్రకాశ్ నారాయణ అన్నారు. వందమంది సమాజంలో పనిచేస్తుంటే అందులో ముగ్గురికే ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని, ఆ ముగ్గురు కూడా మనకి పనికొచ్చే పని చేయడంలేదని అన్నారు. కూర్చునే కుర్చీ దగ్గర్నుంచి, చేతికి పెట్టుకునే వాచీ, వేసుకునే బట్టల వరకు ఏవీ ప్రభుత్వం తయారు చేయడంలేదని అన్నారు. జాబ్ క్యాలెండర్ కేవలం డ్రామా అన్నారు. వంద ఉద్యోగాలకు లక్ష మంది పోటీ పడుతుంటే, వయో పరిమితి పెంపు ద్వారా రెండు లక్షల మంది పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. అయినా వస్తున్న ఉద్యోగాలు వంద మాత్రమేనని తెలిపారు. మిగిలినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ద్వారా అందరికీ ఉద్యోగాలు వస్తాయనడం పచ్చి అబద్ధమని స్పష్టంచేశారు.

కలెక్టర్ కన్నా ప్లంబర్ అవసరమే ఎక్కువ...

ఎక్కడో దూరంగా ఉన్న కలెక్టర్ కన్నా బాత్రూమ్ తూముల్లో పూడికతీసే ప్లంబర్ చాలా మిన్న అని జేపీ చెప్పారు. కలెక్టర్ లేకుంటే ఎవరికైనా నష్టం జరిగిందా, కలెక్టర్ లేకపోవడంవల్ల నా బతుకు చిందరవందర అయిందనేవారు ఎక్కడైనా ఉన్నారా అని ప్రశ్నించారు. బాత్రూమ్ తూములో పూడిక తీయకపోతే మీరు బతకగలరా అని చెప్పారు.

తెలంగాణ భవన్‌లో రుణమాఫీ హెల్ప్‌లైన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

రుణమాఫీపై గవర్నర్‌ను కలుస్తాం

- రుణమాఫీకాని రైతుల వివరాలు అందిస్తాం
- ఇప్పటికి 72వేల ఫిర్యాదులు
- ప్రభుత్వం దృష్టికీ తీసుకెళ్తాం: హరీశ్‌రావు
- తెలంగాణ భవన్‌లో హెల్ప్ లైన్ సెంటర్ పరిశీలన

తేదీ	ఫిర్యాదుల సంఖ్య
ఆగస్టు 6	26,864
ఆగస్టు 7	13,384
ఆగస్టు 8	8,216
ఆగస్టు 9	1,862
ఆగస్టు 10	3,304
ఆగస్టు 11	2,630
ఫోన్‌కాల్ ద్వారా	16,287
మొత్తం	72,547

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): రైతులందరికీ రుణమాఫీ చేయాలని గవర్నర్‌ను కలవనున్నట్టు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఇప్పటి వరకు 72 వేల ఫిర్యాదులు అందాయని ఆయన వివరించారు. రుణమాఫీకానీ రైతుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన రుణమాఫీ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సోమవారం హరీశ్‌రావు పరిశీలించారు. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు, మేసేజ్‌లపై ఆరా తీశారు. ఈ వివరాలన్నింటినీ గవర్నర్‌కు, ప్రభుత్వానికి అందచేస్తామని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులకు అండగా నిలిచేందుకు తెలంగాణ భవన్‌లో ఈనెల 6 నుంచి హెల్ప్‌లైన్ సెంటర్(నంబర్ 83748 52619)ను ప్రారంభించారు. హరీశ్‌రావు వెంట మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నే గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పెండింగ్.. బీఆర్ఎస్ రన్నింగ్

హస్తంపార్టీ హయాంలో దశాబ్దాలపాటు ప్రాజెక్టుల పనులు

- ఎస్సారెస్పీ స్టేజ్-2.. కృష్ణాబేసిన్ పథకాలే ఇందుకు నిదర్శనం
- ఏండ్ల తరబడి ముందుకుసాగని ఎల్లంపల్లి, మిడ్ మానేరు
- కేసీఆర్ సారథ్యంలోనే పరుగులు పెట్టిన అనేక ప్రాజెక్టులు
- నిర్ణీత గడువులోనే అనుమతులు సహా పనులన్నీ పూర్తి
- స్వల్పకాలంలోనే తుమ్మిళ్ల, భక్తరామదాసు, కాళేశ్వరం, పాలమూరు, సీతారామ పథకాలు కంప్లీట్

హైదరాబాద్, ఆగస్టు12 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల మంజూరుకు ఏండ్లు! ఆ తర్వాత సర్వేకోసం మరికొన్నేండ్లు! శంకుస్థాపనకు ఇంకొన్ని సంవత్సరాలు! ఆ తర్వాతైనా పనులు పూర్తవుతాయా? అంటే అదీ లేదు! అనుమతుల మాటంటారా.. ఆ ఊసన్నదే ఉండదు! ఎక్కడివక్కడే పెండింగ్! దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాజెక్టుల దుస్థితి ఇది! సూటిగా చెప్పాలంటే పెండింగ్ అనే పదానికే కాంగ్రెస్ జమానా చిరునామా! నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణను సాధించి పాలనా పగ్గాలు చేపట్టాక, మొట్టమొదటి నినాదమైన నీళ్లను రైతులకు అందించి మన భూములను సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టులను పరుగులు పెట్టించారు. పెండింగ్ ప్రాజెక్టులన్నీ బీఆర్ఎస్ జమానాలో రన్నింగ్ ప్రాజెక్టులుగా మారాయి. నిర్దేశిత గడువు, నిర్ణీత సమయానికి పూర్తయి సాగునీటి ఫలాలను రైతాంగానికి అందించాయి. ఏకకాలంలోనే పలు మేజర్ ప్రాజెక్టుల అనుమతులను కూడా సాధించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కింది.

ఎన్నో ప్రాజెక్టులు ఏండ్ల తరబడి..

కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టుల పనులన్నీ ఏండ్ల తరబడి కొనసాగాయి. కల్వకుర్తి, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలే ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. ఈ ప్రాజెక్టుల సర్వే కోసం 1984లో జీవో జారీ చేయగా, ఐదేండ్ల తర్వాత సర్వే కోసం సర్కిల్ కార్యాలయం ఏర్పాటైంది. 1997లో సర్వే కోసం రూ.50 లక్షలు మంజూరు కాగా, 1999లో పరిపాలనా అనుమతులు వచ్చాయి. 2003లో టెండర్ల ప్రక్రియ పూర్తయి టీడీపీ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. మొత్తంగా ప్రాజెక్టు సర్వేకు 1984 జీవో జారీ చేస్తే 20 ఏండ్ల తర్వాత ఎన్నికల ముందు, తర్వాత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పనులు పూర్తి చేయలేదు. నిధుల కొరత, భూసేకరణ, అటవీ అనుమతులు, రైల్వే, రోడ్డు క్రాసింగ్, అంతర్రాష్ట్ర వివాదాలు, కాంట్రాక్టు సంస్థలతో వివాదాలు, కోర్టు కేసులు తదితర సాకులతో ప్రాజెక్టులను మూలకునెట్టింది. ఎత్తిపోతల పథకాల్లో సంక్లిష్టమైన పంప్‌హౌస్, సర్జ్‌పూల్‌ల నిర్మాణం, పంపులు, మోటర్లను బిగింపు, విద్యుత్ సరఫరా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ కాలువలకు కావాల్సిన భూసేకరణ సైతం పూర్తి చేయలేదు. రెండు ప్రాజెక్టులే కాకుండా కోయిల్‌సాగర్, రాజీవ్‌భీమా, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, ఎస్సారెస్పీ స్టేజీ-2, వరద కాలువ, దేవాదుల ఎత్తిపోతలు ఇలా చెప్పుకొంటూ పోతే పూర్తికాని ప్రాజెక్టులు కోకొల్లలుగా ఉన్నాయి.

బీఆర్ఎస్ హయాంలో చకచకా..

రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సారథ్యంలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ రన్నింగ్ ప్రాజెక్టులుగా మారాయి. ఇంజినీరింగ్ నిపుణులతో కూలంకషంగా సమీక్షించి సమస్యలు పరిష్కరించారు. క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిరంతర పర్యవేక్షణతో ప్రాధాన్యత క్రమంలో నిధులు సమకూర్చుతూ, అనుమతులను సత్వరమే జారీ చేస్తూ పనులను పరుగులు పెట్టించారు. కేవలం రెండేళ్లలోనే ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టు పనులను 50శాతం నుంచి 95 శాతం పూర్తిచేశారంటే కేసీఆర్ అకుంఠిత దీక్షను అర్థం చేసుకోవచ్చు. 2016-17లో కల్వకుర్తి ద్వారా 3.07 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ద్వారా 1.2 లక్షలు, భీమా ద్వారా 1.58 లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ద్వారా 8 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు.. మొత్తం నాలుగు ఎత్తిపోతల పథకాల ద్వారా 5 లక్షల ఎకరాలకు తొలిసారిగా సాగునీటిని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుంది. క్రమంగా డిస్ట్రిబ్యూటరీల పనులను పూర్తి చేస్తూ నేడు ప్రాజెక్టుల కింద నికరంగా 10లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతున్నది. ఆర్డీఎస్ ఆయకట్టు కోసం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి కేవలం 11నెలల వ్యవధిలోనే పూర్తిచేశారు. బృహత్తర పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడమే కాకుండా ప్రధాన పనులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయి. గోదావరి బేసిన్‌లోనూ మిడ్‌మానేరు, ఎల్లంపల్లి ప్రాజెక్టులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. వరద కాలువ సజీవజలధారగా మారింది. బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్ల కనిష్ఠ సమయంలోనే కేసీఆర్ సర్కార్ పూర్తిచేసింది. ఖమ్మం జిల్లాలో భక్తరామదాసు ప్రాజెక్టును 10నెలల్లోనే పూర్తిచేశారు. సీతారామ ప్రాజెక్టు పనులన్నీ పూర్తిచేసి ట్రయల్‌రన్‌కు సిద్ధం చేసిపెట్టారు. అనుమతులు సైతం ప్రస్తుతం తుదిదశలో ఉన్నాయి. ఇవీగాక దశాబ్దాలుగా పెండింగ్ ప్రాజెక్టులుగా ముద్ర వేసుకున్న అనేక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను కూడా పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కింది.

ప్రాజెక్టు	ఉమ్మడి జిల్లా	ప్రారంభం-పూర్తి	వినియోగంలోకి తెచ్చింది	అదనపు ఆయకట్టు (ఎకరాల్లో)
...కృష్ణాబేసిన్‌లో...				
జూరాల	మహబూబ్‌నగర్	1982-1995	టీడీపీ	1,30,000
కోయిల్‌సాగర్(లిఫ్ట్)	మహబూబ్‌నగర్	2000-2017	బీఆర్ఎస్	8000
రాజీవ్‌భీమా	మహబూబ్‌నగర్	2003-2016	బీఆర్ఎస్	1,58000
నెట్టెంపాడు	మహబూబ్‌నగర్	2005-2016	బీఆర్ఎస్	1.42000
కల్వకుర్తి	మహబూబ్‌నగర్	2003-2016	బీఆర్ఎస్	3,07,000
తుమ్మిళ్ల లిఫ్ట్	మహబూబ్‌నగర్	2018-2018	బీఆర్ఎస్	87000
పీఆర్ఎల్ఐఎస్	మహబూబ్‌నగర్	2015-2023	బీఆర్ఎస్	(డిస్ట్రిబ్యూటరీలు తవ్వాల్సి ఉంది)
...గోదావరి బేసిన్‌లో...				
వరద కాలువ	కరీంనగర్	1991-2019	బీఆర్ఎస్	51,000
ఎస్సారెస్పీ స్టేజీ- 2	వరంగల్	2002-2019	బీఆర్ఎస్	3,81,000
మిడ్‌మానేరు	కరీంనగర్	2005-2018	బీఆర్ఎస్	100000
ఎల్లంపల్లి	కరీంనగర్	2004-2016	బీఆర్ఎస్	54000
కాళేశ్వరం	కరీంనగర్	2016-2019	బీఆర్ఎస్	1.30,000 (కొత్తది మాత్రమే)
భక్తరామదాసు	ఖమ్మం	2016-2017	బీఆర్ఎస్	60,000
సీతారామ	ఖమ్మం	2017-2023	బీఆర్ఎస్	100000

'గడల' గుడ్ బై

శ్రీనివాసరావు వీఆర్ఎస్‌కు ప్రభుత్వం ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): మాజీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) గడల శ్రీనివాసరావు వైద్యారోగ్య శాఖలో తన ప్రస్థానానికి ముగింపు పలికారు. ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తును (వీఆర్ఎస్) ప్రభుత్వం ఆమోదించింది. 6 నెలల తర్వాత ఆయన వీఆర్ఎస్‌ను ఆమోదిస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఏడేండ్ల సర్వీస్ ఉండగానే గడల స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ప్రజారోగ్య విభాగంలో జాయింట్ డైరెక్టర్ క్యాడర్‌లో ఉన్న ఆయనను గత నెల 27న మహబూబాబాద్ అడిషినల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. కానీ ఆయన విధుల్లో చేరలేదు. గడల శ్రీనివాసరావు 2018 మే నుంచి 2023 డిసెంబర్ 20వరకు సుదీర్ఘ కాలం డీపీహెచ్‌గా కొనసాగారు.

కరోనా సమయంలో ఫుల్ క్రేజ్

గడల శ్రీనివాసరావు నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్నప్పుడే మాజీ సీఎం కేసీఆర్ ఆయన సమర్థతను గుర్తించారు. సీనియర్లను కాదని 2018 మే 28న డీపీహెచ్‌గా నియమించారు. స్వేచ్ఛగా పనిచేసుకునే అవకాశం ఇచ్చారు. విపత్తుల సమయంలో గడల సమర్థంగా పనిచేశారు. 2019లో డెంగ్యూ విజృంభించగా.. తక్కువ సమయంలోనే అదుపులోకి తీసుకురాగలిగారు. ఇక కరోనా విపత్తు సమయంలో గడల శ్రీనివాసరావు పేరు మార్మోగిపోయింది. నాటి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొవిడ్ నియంత్రణ, చికిత్స, వ్యాక్సినేషన్‌ను సమర్థంగా నిర్వహించారు. గడలకు బీఆర్ఎస్ ముద్ర ఉండటంతో కాంగ్రెస్ ఆయనను పక్కనబెట్టింది. దీంతో ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారు.

డీసీసీబీలో రుణమాఫీ కుంభకోణం

వరంగల్ జిల్లాలో కదులుతున్న డొంక

నల్లబెల్లి, ఆగస్టు 12: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని డీసీసీ బ్యాంకులో భారీ రుణమాఫీ కుంభకోణం బయటపడుతున్నది. పోలీసులు విచారణ చేపట్టి తీగ లాగితే డొంక కదులుతున్నది. మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఆధార్ నమోదును తప్పులతడకగా పంపించటంతో అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తించలేదు. దీనిని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ మిస్‌మ్యాచ్ సమస్యను గుర్తించారు. మండలంలోని ఓ తండావాసులు గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా పాస్ పుస్తకాలు పోయినట్టు తహసీల్దార్ కార్యాలయంలో అప్లికేషన్ పెట్టి డూప్లికేట్ పొంది అక్రమంగా రుణాలు తీసుకున్నట్టు తెలిసింది. అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది, పాలకవర్గం కుమ్మక్కై అధిక రుణం మంజూరుచేసి వారికి పావు వంతు ఇచ్చి మిగతా డబ్బులను సీఈవో నేతృత్వంలో పంచుకున్నట్టు సమాచారం. నందిగామకు చెందిన భూక్యా రాములు రుణమాఫీ మంజూరులో అధికారుల చేతుల్లో మోసపోయానని చెప్తున్నాడు. తనకు గ్రామంలో 10 ఎకరాల భూమి ఉండగా, తనతో పాటు తన భార్య మమత పేరున పీఏసీఎస్ కార్యాలయంలో క్రాప్‌లోన్ కోసం దరఖాస్తు చేసుకోగా 2021లో రూ.4 లక్షలు రుణం మంజూరు చేశారని చెప్పారు. ఈ రుణాన్ని 2023లో మూడు దఫాలుగా రూ.2.50 లక్షలు సీఈవో ఇచ్చారని, మిగతా రూ.లక్షన్నర పీఏసీఎస్ సార్లే వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తన పేరున రూ.5 లక్షలకుపైగా అప్పు ఉన్నట్టు బ్యాంకులో చూపిస్తున్నదని ఆ దంపతులు వాపోయారు. వీరు ఆదివారం పీఏసీఎస్ అధికారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన రైతు కొమ్ము రాజు రూ.75 వేలు రుణం తీసుకోగా వడ్డీతో కలిసి రూ.85 వేలు ఉన్నట్టు తెలిపారు. ఈ డబ్బులను 2023లో రెన్యువల్ చేసి 2024లో ఏకంగా రూ.1.96 లక్షల అప్పు ఉన్నట్టు బ్యాంకు అధికారులు చూపెట్టడంతో అవాక్కైన బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీఏసీఎస్ అధికారులపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై ప్రశాంత్‌బాబు విచారణ చేపట్టారు. విచారణలో సంబంధిత సీఈవో అప్రూవర్‌గా మారి బ్యాంకులో జరిగిన అక్రమాలను పోలీసులకు క్షుణ్ణంగా చెప్పటంతో డీసీసీ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగులోకి వస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్న యోచనతో మండలంలోని అనేక మంది రైతుల పేరున అధికారులు పెద్దమొత్తంలో రుణం మంజూరు చేసి రూ.కోట్లు కాజేసినట్టు బహిర్గతం అవుతున్నది.

నందిగామ డీసీసీ బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ చేస్తున్న ఎస్సై